

సివిల్స్ సాధకులు

చిల్లకూరు ఇంజనీరుకు 558వ ర్యాంకు



సాయితేజ

చిల్లకూరు, ఏప్రిల్ 16 : చిల్లకూరు ఇంజనీరు సివిల్స్‌లో 558వ ర్యాంకు సాధించారు. చిల్లకూరు టీచర్స్ కాలనీలో నివాసముంటున్న నెల్లూరు శ్రీనివాసులు చిల్లకూరు మండలంలోని గుమళ్ల దిబ్బ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.ఆయన భార్య సరస్వతి ఓజిలి మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్‌సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. వీరి కుమారుడు సాయి తేజ తాజాగా విడుదలైన సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించారు. హైదరాబాదులోని బీహెచ్‌ఈఎల్ కంపెనీలో సాయితేజ 8 ఏళ్ల నుంచి సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా ఆయన భార్య జ్యోతి హైదరాబాదులోని పీడబ్ల్యుసీ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు.



తల్లిదండ్రులు, భార్యతో సాయితేజ

ఐఎఫ్ఎస్ నా లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగులైన మా అమ్మానాన్న చిన్నప్పట్నుంచీ పేదలకు సేవ చేయాలని, అందుకు సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించాలని చెబుతూవచ్చిన మాటలు నా మనుసులో నాటుకుపోయాయి. పదవ తరగతి వరకు చిల్లకూరులోని ఎల్‌ఏపీ పాఠశాలలో చదివా. విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్, హైదరాబాదులోని ఐఐటీలో ఈసీఈ పూర్తిచేశా. గేట్‌లో ఎంపిక కావడంతో 2016లో హైదరాబాదులోని బీహెచ్‌ఈఎల్‌లో ఇంజనీరుగా చేరా. ప్రస్తుతం అదే కంపెనీలో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా.సివిల్స్‌లో ర్యాంకు సాధించాలన్న పట్టుదలతో ఉద్యోగం చేస్తూనే ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా చదివి పరీక్షలు రాశా.నాల్గసారి పరీక్షలకు హాజరైన నాకు సివిల్స్‌లో 558వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.అయితే ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు ఎంపిక కావడమే నా లక్ష్యం.

భీమ్‌నగర్‌వాసికి 810వ ర్యాంకు



ధనంజయకుమార్

కల్లూరు, ఏప్రిల్ 16 : పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి భీమ్‌నగర్‌కు చెందిన వి.ధనంజయకుమార్ సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.కృష్ణయ్య, ముత్యాలమ్మ దంపతుల కుమారుడైన ధనంజయకుమార్ ప్రస్తుతం కడపలోని ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.తమ్ముడు వేణుగోపాల్ కల్లూరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.పులిచెర్ల మండలంలోని కల్లూరు శారదా విద్యామందిర్‌లో 5వ తరగతి వరకు చదువుకున్న ధనంజయకుమార్ మదనపల్లె సమీపంలోని వలసపల్లి జవహర్ నవోదయలో 6నుంచి ఇంటర్ వరకు చదువుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాలలో ఈఈఈ గ్రూపులో బీటెక్ పూర్తిచేశారు. 2011వ సంవత్సరంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో మేనేజర్‌గా చేరి సుమారు ఏడేళ్ల పాటు పనిచేశారు. 2016వ సంవత్సరంలో గ్రూప్-1 పరీక్ష రాసి 2018లో ఎక్సైజ్‌శాఖలో సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించారు. మొదట అనంతపురంలో పనిచేసి ప్రస్తుతం కడపలో పనిచేస్తున్నారు.ఉద్యోగం చేస్తూనే కోచింగ్ తీసుకోకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేరయ్యారు.తాజాగా విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.



తమ్ముడు వేణుగోపాల్ , తల్లి ముత్యాలమ్మ, భార్య నిరూపతో ధనంజయకుమార్


అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళతా

ఐఏఎస్ సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నా. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళతా. పేద విద్యార్థులను విద్యాపరంగా ఆదుకోవాలనుకుంటున్నా.

వసతి గృహాల్లో విద్యార్థుల ఆకలి కేకలు

పేద విద్యార్థులు ఆశ్రయం పొందుతున్న వసతి గృహాలను అన్ని హంగులతో తీర్చి దిద్దుతున్నాం.. పేద విద్యార్థుల భవితకు భరోసా కల్పిస్తున్నాం.. అని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కాని విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టే బాధ్యతను మాత్రం విస్మరించింది. ఒకట్రెండు కాదు ఏకంగా ఐదు నెలలుగా మెస్ బిల్లులు (డైట్ చార్జీలు) విడుదల చేయలేదు. వార్డెన్లు.. అప్పులు చేసి పేద విద్యార్థులకు చాలీచాలని భోజనాన్ని వడ్డిస్తుండటంతో విద్యార్థుల కడుపు నిండటం లేదు. - చిత్తూరు

జిల్లాలో 3వ తరగతి నుంచి పీజీ వరకు 57 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సుమారు 3వేల మంది, 38 బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 2800 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. విద్యార్థి తరగతిని బట్టి నెలకు రూ.1,400, రూ.1,600 చొప్పున మెస్ చార్జీలను ప్రభుత్వం ఇస్తుంది. ఈ డబ్బుతోనే నెలంతా ఆ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి. నెలకు రూ.87 లక్షల చొప్పున ఐదు నెలలుగా రూ.4.35 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి.



ఐదు నెలలుగా రూ.4.35 కోట్ల బిల్లుల పెండింగ్

అప్పులు చేసి.. అరకొరగా భోజనం పెడుతున్న వార్డెన్లు

పెరిగిన ధరలతో పౌష్టికాహారం వడ్డించేదెలా?

2019కు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం కిలో చికెన్ ధర రూ.170 చొప్పున నిర్ణయించింది. అలాగే నూనె, చింతపండు, కంది పప్పు.. వంటి అన్ని సరుకుల ధరల్నీ అప్పటి ధరలకు అనుగుణంగా ఫిక్స్ చేసింది. ఈ ఐదేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగాయి. కరోనా లాక్‌డౌన్ తర్వాత ప్రతి వస్తువు ధర రెట్టింపు అయింది. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా.. టీడీపీ నిర్ణయించిన ధరల్నే అమలు చేస్తోంది. కొత్తగా ఒక్క రూపాయి కూడా పెంచలేదు. దీంతో వార్డెన్లు నాణ్యత లేని సరుకుల్ని కొని అరకొరగా విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

- చిత్తూరు ఎస్టేట్ ప్రాంతంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరికి నెలకు సగటున రూ.45వేల బిల్లు రావాల్సి ఉంది. ఐదు నెలలుగా బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు అప్పులు చేసి వడ్డిస్తున్నారు. ఐదు నెలలకుగానూ రూ.2.25లక్షల బిల్లులు రావాల్సి ఉంది.

దుకాణదారులకు ముఖం చూపలేకున్న వార్డెన్లు

జిల్లాలోని ప్రతి వార్డెన్.. చికెన్, కోడిగుడ్లు, అరటిపండ్లు, గ్యాస్ తదితరవాటిని అప్పులు చేసి కొంటున్నారు. దుకాణదారులు కూడా వార్డెన్లపై ఉన్న నమ్మకంతో అప్పులు ఇస్తున్నారు. ఏ నెల బిల్లును అదే నెలలో..మరుసటి నెలలోనైనా క్లియర్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఏకంగా ఐదు నెలల పాటు మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో దుకాణదారులు కూడా ఇక అప్పు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. వార్డెన్లు కూడా పాత అప్పులు చెల్లించకుండా కొత్తగా అప్పు చేయలేకపోతున్నారు. దుకాణదారులకు ముఖం చూపలేక, త్వరలోనే బిల్లులిస్తామంటూ కిందిస్థాయి సిబ్బందిని పంపించి సరుకులు తెప్పించుకోవాల్సి వస్తోంది.

- బంగారుపాళ్యం ఎస్సీ హాస్టల్‌లో 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి డిసెంబరు నెల నుంచి మెస్ బిల్లులు రావడం లేదు. ఈ కారణంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలను వడ్డించలేకపోతున్నారు.

నా భర్తను రిలీవ్ చేయండి

- కలెక్టర్‌ని కోరిన నోడల్ అధికారి బాలాజి సతీమణి!
- ఇటీవల జరిగిన ఘటనతో భయపడుతున్న కుటుంబీకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 16: తన భర్తను జిల్లా నుంచి రిలీవ్ చేయాల్సిందిగా జడ్పీ నోడల్ అధికారిగా పనిచేస్తున్న ఎంపీడీవో బాలాజి సతీమణి సోమవారం కలెక్టర్‌ను కలిసి కోరినట్లు సమాచారం. జడ్పీ సమావేశ మందిరం నిర్మాణ విషయమై విచారణ జరుగుతోంది. ఇందులో బాలాజీకి సంబంధం లేకున్నా జడ్పీ పూర్వ అధికారికి నమ్మిన వ్యక్తి అనే కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల బైరెడ్డిపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేష్ పలమనేరులోని బాలాజి ఇంట్లో అనధికారికంగా సోదాలు చేసి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై కలెక్టర్ షన్మోహన్ ఆగ్రహించి.. రాజేష్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బాలాజి సతీమణి భయపడి తన భర్తను రిలీవ్ చేయాలని కలెక్టర్‌ని కలిసి వేడుకున్నట్లు సమాచారం. అయితే దీనిపై కలెక్టర్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కాగా.. ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీవో అయిన బాలాజీని నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. అయితే ఆయన్ను ఇంతవరకు జిల్లా నుంచి రిలీవ్ చేయలేదు. దీనిపై ఆమధ్య నెల్లూరు జిల్లా టీడీపీ నేత సోమిరెడ్డి ఎన్నికల కమిషన్‌కి కూడా ఫిర్యాదు చేశారు.

విచారణ పూర్తి

జడ్పీ సమావేశ మందిరం నిర్మాణ విషయమై జరుగుతున్న విచారణ మంగళవారం పూర్తయ్యింది. నివేదికను పంచాయతీరాజ్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు విచారణ అధికారి జేసీ శ్రీనివాసులు అందించనున్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

సుర్రుమంటున్న సూరీడు

శ్రీరంగ రాజపురంలో అత్యధికంగా 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఎండలు మండిపోతున్నాయి. ఇంట్లో ఉన్నా, బయటకు వచ్చినా చెమటలు ఆగడంలేదు. దీనికితోడు వడగాడ్పులు మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏప్రిల్ మూడో వారానికే ఇలా ఉంటే, మే నెలాఖరుకు పరిస్థితి ఏమిటని అంతా ఆందోళన చెందుతున్నారు. మంగళవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు మండలాల వారీగా.. శ్రీరంగరాజపురంలో 40.8, పులిచెర్లలో 40.7, తవణంపల్లెలో 40.1, పుంగనూరులో 40.0, నింద్రలో 39.5, సోమలలో 39.4, సదుంలో 39.3,బంగారుపాళ్యంలో 39.0, పాలసముద్రంలో 38.9, చిత్తూరు, కార్వేటినగరంలో 38.7, గంగవరంలో 38.6, గుడిపాలలో 38.5, చౌడేపల్లె, రొంపిచెర్ల, యాదమరి, నగరిలో 38.4, కుప్పంలో 38.3, పెద్దపంజాణి, వెదురుకుప్పంలో 38.0, గంగాధరనెల్లూరులో 37.9, పలమనేరు, పెనుమూరు, పూతలపట్టులో 37.7, వి.కోట, గుడుపల్లెలో 37.6, శాంతిపురంలో 37.5, విజయపురంలో 36.8, రామకుప్పం, బైరెడ్డిపల్లెలో 36.5, ఐరాలలో 36.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'ద్రావిడ'లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య ఘర్షణ

గుడుపల్లె, ఏప్రిల్ 16: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. దీనిపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కొన్ని నెలలుగా అధికారులు.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదని అందరూ కలిసి పరిపాలన భవనం ఎదుట నిరసన తెలపడానికి పూనుకున్నారు. అయితే కొంతమంది నిరసనకు వెనకడుగు వేశారు. మంగళవారం భాషా భవనంలోని పలు విభాగాల్లో కొంతమంది ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఆ విషయం తెలుసుకున్న ఉద్యోగులు కొందరు విధులకు హాజరైన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘర్షణకు దిగారు. ఆ తర్వాత గుడుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసుకున్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం

కుప్పం, ఏప్రిల్ 16: కుప్పం మండలంలోని ఓ దివ్యాంగురాలిపై రమేష్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు స్థానికులు తెలిపారు. బాధితురాలిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని కుటుంబీకులు కోరుతున్నారు.

ఆరుగురు ఎన్నికల పరిశీలకుల నియామకం : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

జిల్లాలోని పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యవహారాల పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఆరుగురు ఎన్నికల పరిశీలకులను నియమించింది. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నామినేషన్లు స్వీకరించే ఆర్వో, కార్యాలయాల వివరాలనూ వెల్లడించారు.

నామినేషన్లు స్వీకరించే ఆర్వో, కార్యాలయాలివే..

- చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - కలెక్టర్ షన్మోహన్, కలెక్టర్ చాంబర్, కలెక్టరేట్, చిత్తూరు.
- పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి- వై.మధుసూదన్ రెడ్డి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కేఆర్‌సీసీ, చిత్తూరు), తహసీల్దార్ కార్యాలయం, పుంగనూరు.
- నగరి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - కె.వెంకటరెడ్డి (ఆర్డీవో, నగరి), తహసీల్దార్ కార్యాలయం నగరి.
- గంగాధరనెల్లూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - సి.వెంకటశివ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఐవోసీఎల్, చిత్తూరు) - తహసీల్దార్ కార్యాలయం, గంగాధరనెల్లూరు.
- చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జేసీ చాంబర్, కలెక్టర్ కార్యాలయం, చిత్తూరు.
- పూతలపట్టు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - జి.చిన్నయ్య (ఆర్డీవో, చిత్తూరు), తహసీల్దార్ కార్యాలయం, పూతలపట్టు.
- పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - ఎన్. మనోజ్ రెడ్డి (ఆర్డీవో, పలమనేరు), ఆర్డీవో చాంబర్, ఆర్డీవో కార్యాలయం, పలమనేరు.
- కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి - జి. శ్రీనివాసులు (ఆర్డీవో, కుప్పం), రూమ్ నెం. 1, తహసీల్దార్ కార్యాలయం, డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కుప్పం.

నియోజకవర్గాల వారీగా పరిశీలకులిలా..

- చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు - శంకర్ ప్రసాద్ శర్మ, సెల్ నెం: 95824 67890.
- నగరి, గంగాధరనెల్లూరు (ఎస్సీ) నియోజకవర్గాలకు జనరల్ పరిశీలకుడు - కైలాష్ వాంఖడే, సెల్ నెం: 94251 01644.
- చిత్తూరు, పూతలపట్టు (ఎస్సీ), పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు జనరల్ పరిశీలకుడు - ఎండీ షాదిక్ అలామ్, సెల్ నెం: 94371 15515.
- పుంగనూరు, నగరి, గంగాధరనెల్లూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడు - ఎస్.శ్రీనివాస్ ఖన్నా, సెల్ నెం: 87623 00622.
- చిత్తూరు, పూతలపట్టు (ఎస్సీ), పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు - రోహన్ ఠాకూర్, సెల్ నెం: 90138 52987.
- నగరి, గంగాధరనెల్లూరు (ఎస్సీ), చిత్తూరు, పూతలపట్టు (ఎస్సీ), పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీసు పరిశీలకుడు - అరవింద్ హెచ్. సాల్వే, సెల్ నెం: 90113 90100.

రేపటినుంచి నామినేషన్ల స్వీకరణ: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 16: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి గురువారం నుంచి ఈనెల 25వతేదీ వరకు కలెక్టరేట్‌లోని జేసీ మీటింగ్ హాలులో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని చిత్తూరు ఆర్వో, జేసీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డీఎస్పీ రాజగోపాల్ రెడ్డితో కలసి వివిధ విభాగాల ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.నామినేషన్ల స్వీకరణ రోజూ ఉదయం 11నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ఇంటి వద్ద బయల్దేరినప్పటి నుంచి ఖర్చయ్యే ప్రతి పైసాను అభ్యర్థి ఖాతాకు జమచేయడం జరుగుతుందన్నారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రచారాలపై వంద శాతం నిఘా పెట్టాలని, అవసరమైతే బృందాలను పెంచుకుని షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, రూట్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని మరోసారి పరిశీలించి, మౌలిక సదుపాయాలపై ఆరా తీయాలన్నారు. ప్రచారాలకు రాజకీయ పార్టీలు ఉపయోగించే వాహనాలపై ఎన్నికల అధికారులిచ్చిన అనుమతి కాపీ లేకుండా సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రచార సమయాల్లో బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని, ఎవరైనా కాలిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ, తహసీల్దార్లు శ్రీనివాసులు రెడ్డి (చిత్తూరు), విజయలక్ష్మి (గుడిపాల), ఎంపీడీవోలు సుధాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పోలీసు అధికారులు, వివిధ బృందాల నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి

నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు : జేసీ



రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 16: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమవుతుందని రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జేసీ మీటింగ్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. అంతకు ముందు రాజకీయ పార్టీల స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ రెండు సమావేశాల్లో జేసీ మాట్లాడుతూ.. అనుమతి పొందిన మేర నాలుగు సెట్ల నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థి వేరే నియోజకవర్గం వ్యక్తి అయితే అందుకు సంబంధించిన ఓటరు జాబితా కాపీ జతచేయాలని అన్నారు. పోలింగ్ ఏజెంట్లుగా ఎటువంటి నేరచరిత్ర లేనివారిని నియమించుకోవాలని ఆదేశించారు. నామినేషన్ దాఖలు సమయంలో నోడ్యూ సర్టిఫికెట్, బ్యాంకు ఖాతాపుస్తకం, 10 తాజా పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెక్యూరిటీ డిపాజిట్ నేరుగా అందజేయాలన్నారు. అభ్యర్థి నామినేషన్ రుసుం నుంచి మినహాయింపు కోసం తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం అందివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, రాజసింహులు, గురజాల జగన్మోహన్, సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ), గంగరాజు (సీపీఎం), లోకనాథం (బీఎస్పీ), ఏఆర్వో అరుణ, చిత్తూరు, గుడిపాల మండల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.40లక్షల సీజ్

చిత్తూరు, ఏప్రిల్ 16: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బులను తీసుకెళుతున్న ఓ వ్యక్తి నుంచి రెండో పట్టణ పోలీసులు రూ.1.40 లక్షలను సీజ్ చేశారు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం 70 కొత్తపల్లెకు చెందిన గోపీనాథ నాయుడు మంగళవారం తన అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనంలో రూ.1.40 లక్షలు తీసుకెళుతున్నాడు. వాహన తనిఖీల్లో భాగంగా చిత్తూరు గాంధీ రోడ్డులో అతడి వద్ద నిబంధనలకు విరుద్ధంగా నగదు ఉన్నట్లు గుర్తించారు. దాంతో నగదును సీజ్ చేసి, ఖజానా శాఖలో డిపాజిట్ చేశారు. సరైన బిల్లులు చూపించి నగదును తీసుకోవాలని ఎస్ఐ సూచించారు.

శేషాచల అడవుల్లో మంటలు



తిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం మంటలు రేగాయి. తిరుమలకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం, మొదటి ఘాట్‌రోడ్డుకు సమీపంలో వున్న సానరాళ్లమిట్ట వద్ద అడవికి నిప్పంటుకుంది.ఎండతీవ్రతకు చెట్లు బాగా ఎండిపోయి వున్న క్రమంలో మంటలు వేగంగా వ్యాపించాయి.అటవీశాఖ, టీటీడీ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది మంగళవారం రాత్రి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలు తిరుమల దిశగా రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు అడవిలో మంటలను ఆశ్చర్యంగా చూశారు.

ఖాట్మండు వర్సిటీతో పద్మావతి వర్సిటీ ఎంవోయూ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16: నేపాల్‌లోని ఖాట్మండు యూనివర్సిటీతో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం చేసుకుంది. హైదరాబాదులో ఈ నెల 15 నుంచీ నిర్వహించిన వైస్ ఛాన్సలర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ ఒప్పందం కుదిరింది. ఖాట్మండు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బోలా తప,మహిళా యూనివర్సిటీ వీసీ భారతి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఒప్పందంలో భాగంగా స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్సేంజ్‌తో పాటు రీసెర్చ్ కొలాబరేషన్, డ్యూయెల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ చేయనున్నట్టు పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి వెల్లడించారు. రెండేళ్ళ పాటు ఈ ఒప్పంద కాల పరిమితి అని ఆమె తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలను పూర్తి చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని అన్నారు.

ముక్కంటి సేవలో పీవీ సింధు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ముక్కంటీశుడిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం మృత్యుంజయ మూర్తి సన్నిధిలో సింధూను వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరి యాదవ్, సీఎస్వో నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.28 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.28 కోట్ల ఆదాయం లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. ఇక సోమవారం 77,511 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,553 మంది తలనీలాలు సమర్పించారు. ఈ మేరకు టీటీడీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

చిల్లకూరు, ఏప్రిల్ 16: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని గుత్తావారిపాళెం గ్రామ సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.... మండలంలోని గుత్తావారిపాళెం సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో రామసుబ్బయ్య(60) వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. అదేతోటలో బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య నాగమ్మ పనిలో చేరారు. కొంతకాలం తరువాత పనిమానేసి వెళ్లిపోవాలని, లేకపోతే చంపుతానని రామసుబ్బయ్యను వెంకటేశ్వర్లు బెదిరించేవాడు. 13 జూలై 2021న రామసుబ్బయ్య రక్తపుమడుగులో పడి తీవ్రగాయాలతో పడి ఉండడాన్ని అదే తోటలో పనిచేస్తున్న ఆవుల కాపరైన బాలయ్య గమనించాడు. వెంటనే రామసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు సమాచారం అందించాడు. అలాగే 108 వాహనంలో రామసుబ్బయ్యను నెల్లూరుకు, అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రామసుబ్బయ్య మృతిచెందాడు. ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తోటలో పనిచేస్తున్న సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు విచారించిన గూడూరు కోర్టు ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి నిందితుడైన వెంకటేశ్వర్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

ఎన్నికల్లో కష్టపడ్డవారికే ప్రాధాన్యం

19న చంద్రబాబు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలిరండి : టీడీపీ

శాంతిపురం, ఏప్రిల్ 16: ఎన్నికల్లో కష్టపడి పనిచేసేవారికి ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. శాంతిపురం మండల టీడీపీ కార్యకర్తల సమావేశం మంగళవారం బాలాజీ కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును ఓడిస్తామని చెబుతున్న వైసీపీ నాయకులకు వణుకు పుట్టేలా ఈనెల 19న కుప్పంలో జరిగే చంద్రబాబు నామినేషన్ కార్యక్రమానికి భారీగా కూటమి నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అదే ఉత్సాహంతో 26 రోజులు కష్టపడి లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యాన్ని సాధించేందుకు పనిచేయాలన్నారు. ప్రతి బూత్‌కు 500 నుంచి 1000 ఓట్లు మెజారిటీ తీసుకు రావాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి గతంలో చంద్రబాబు చేసిన అభివృద్ధి వివరిస్తూ, ఐదేళ్లలో వైసీపీ చేసిన అరాచకాలు చెబుతూ, టీడీపీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేయాలని సూచించారు. అంతకుముందు చెంగుబల్ల పంచాయతీ చెందిన 100 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉదయకుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, చలపతిస్వామి, రుద్రప్ప, నాగభూషణంరెడ్డి, గోవిందరాజులు, చలపతి, శ్రీరాములు, వంకటేష్, కిషోర్, కాశీనాథ్, నామాలప్ప, బాలకృష్ణ, రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, శ్యామల, అనుసూయ, రూప, పుష్ప, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో నాయకులు

నేడు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 16: చిత్తూరు డీఐ రోడ్డులోని రాజామహల్ హోటల్‌లో బుధవారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకులు డాక్టర్ కె.రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 2023వ సంవత్సరం కథలు, కథానికలు, అభ్యుదయ సాహిత్య పోటీల విజేతలకు నగదు పురస్కారం, సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. కళాకారులు, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి

కేవీబీపురం, ఏప్రిల్ 16: మండలంలోని కోవనూరు మలుపు వద్ద సోమవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని పీవీ కండ్రిగ గిరిజన కాలనీకి చెందిన మారయ్య(19) అనే యువకుడు మృతి చెందాడు.. ఏఎస్ఐ లోకనాథం కథనం మేరకు.. సోమవరం రాత్రి మారయ్య పాతపాళెంలో ఓ కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళుతుండగా కోవనూరు మలుపు వద్ద శ్రీకాళహస్తి నుంచి కేవీబీపురం వైపు వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన మారయ్యను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని.. ఆటో డ్రైవర్ కోసం వెతుకుతున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మారయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంరతం బంధువులకు అప్పగించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



తొట్టంబేడు, ఏప్రిల్ 16: శ్రీకాళహస్తి మండలంలోని ల్యాంకో కంపెనీ సమీపంలోని రైల్వే ట్రాక్ పై గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు స్థానిక కర్మాగారాలలో పని చేసే ఉత్తరాదికి చెందిన వ్యక్తిగా రైల్వే పోలీసులు బావిస్తున్నారు. మృతుడి చాతీపై పచ్చబొట్టు హిందీలో ఉంది. అతను తెలుపు, నలుపురంగు గీతల హాఫ్‌షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆతడి శరీరం రెండు బాగాలుగా తెగిపడడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వేపోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

తడ, ఏప్రిల్ 16: బాడుగకు కార్లు తీసుకొని ఉడాయించిన వ్యక్తిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వరదయపాళెం మండలం ఇరుగుళం గ్రామానికి చెందిన బాబు కార్లను అద్దెకు తీసుకొని శ్రీసిటీలోని పరిశ్రమలకు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో తడకు చెందిన గుణశేఖర్, అతని స్నేహితుల వద్ద ఉన్న మూడు కార్లను అద్దెకు తీసుకున్నాడు. రెండు నెలలపాటు అద్దె చెల్లించాడు. ఆ తరువాత కన్పించకుండా పరారయ్యాడు. అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా కడపలో ఆ కార్లను కుదవ పెట్టినట్లుగా గుర్తించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం

ఉమ్మడి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ



గురజాలతో కలిసి చిత్తూరు నగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ/శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 16: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యమిస్తామని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. మంగళవారం చిత్తూరు నగరంలోని 11, 14, 15 డివిజన్ల పరిధిలోని జోగుల కాలనీ, చెన్నమగుడిపల్లె, ఎన్ఎన్ కండ్రిగ, ద్వారకాపురం, గోవిందపురం, బండపల్లె, ఎల్‌బీపురం, చెరువుముందర కండ్రిగ, గాజులపల్లె, హరిజనవాడ, విజయనగరం, కురప్పల్లె, తిమ్మసానిపల్లె, వైఎస్ కాలనీల్లో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. వైసీపీ పాలనలో ఒక్క రోడ్డూ వేయలేదని, కనీసం గుంతలు కూడా పూడ్చలేదని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు వెంకటేష్ యాదవ్, జయలక్ష్మి, శేషాద్రి నాయుడు, నాగరాజు నాయుడు, మధు నాయుడు, భార్గవి, కోడిబాబు, శివ, బీజేపీ నేతలు దుర్గా రామకృష్ణ, అట్లూరి శ్రీనివాసులు, మోహన్ నాయుడు, దొరబాబు గౌడు, మహేష్, జనసేన నేతలు పాల్గొన్నారు.

వైసీపీనుంచి 60 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఎస్ఆర్‌పురం మండలంలోని శెట్టివానత్తం పంచాయతీలో ఎగువ శెట్టివానత్తం, దిగువ శెట్టివానత్తం, పెరుమార్లుగార్ల ఇండ్లు, నల్లపల్లె, చిన్నబావనపల్లెలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టినత్తం గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో 60 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేసి చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే రుణం తీర్చుకుంటానని తెలిపారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కుమారుడు రాధే, ఎమ్మెల్యే అభ్యర్థి కుమారుడు రాహుల్, నేతలు రామిరెడ్డి, రవింద్రరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాధవరెడ్డి, బుల్లెట్ బాబు, సిద్ధయ్యశెట్టి, కుమార్, మహ్బూబాబ్ బాషా, కార్జాల అరుణ, హేమాద్రి యాదవ్, భాస్కర్ నాయుడు, రఘునాథ రెడ్డి, చంద్రరెడ్డి, గుండయ్య, దాము, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో దగ్గుమళ్ల ప్రసాదరావు, అమరనాథరెడ్డి

20, 21 తేదీల్లో తిరుపతిలో ఆర్గానిక్ మేళా

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 16: తిరుపతిలోని మహతి వేదికలో ఈనెల 20, 21 తేదీల్లో ఆర్గానిక్ మేళా నిర్వహించనున్నట్లు కనెక్ట్ టు ఫార్మర్స్ సేవా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 20వ తేదీ శనివారం ఉదయం 10.30 కి కార్యక్రమం మొదలవుతుంది. 11 గంటలకు కషాయల గంగిరెడ్డి కషాయాల తయారీపై శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జేఎస్ రెడ్డి దేశవాళి పూలమొక్కలు, పండ్ల మొక్కలు అంటుకట్టడం గురించి శిక్షణ ఇస్తారు. సాయంత్రం 5గంటలకు డాక్టర్ సింధు మలర్ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పిస్తారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు పండ్ల మొక్కల పెంపకంపై విజయరాం ప్రసంగం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు ప్రకృతి వనం ప్రసాద్ ప్రసంగం ఉంటుంది. స్టాల్ నమోదు కోసం 6303606326లో సంప్రదించవచ్చు.

తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ సేవలు

ఐదు రైళ్లకనుగుణంగా బస్సుల ఏర్పాటు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 16: తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ సేవలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించారు. తిరుపతి నుంచి తమిళనాడు వివిధ ప్రాంతాలకు రాకపోకలు జరిగే ఐదురైళ్ల సమయాలకనుగుణంగా తిరుమల, తిరుపతి, తిరుచానూరు, రేణిగుంట తదితర ప్రాంతాలకు బస్సులు నడవనున్నాయి. ఈ మేరకు నూతన సమయాలను మార్పుచేశారు. టిక్కెట్ బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ప్రతి బస్సు స్టేషన్ ముందు రిక్వెస్ట్ స్టేజ్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఉదయం స్టేసన్‌ను సందర్శించిన ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి రద్దీకనుగుణంగా బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణీకులు ఈ మార్పులను గమనించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు బాలాజీ, హరిబాబు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



తిరుచానూరు రైల్వేస్టేషన్ ముందు ఆగివున్న ఆర్టీసీ బస్సులు

రైళ్ల రాకపోకలు వివరాలు..

- చెన్నై-తిరుపతి(16057) రైలు ఉదయం 9.25గంటలకు రానుంది. తిరుపతి-చెన్నై(16054)ఉదయం 10.10 గంటలకు బయల్దేరుతుంది.
- అరక్కోణం-తిరుపతి(06753) ఉదయం 11గంటలకు వస్తుంది. తిరుపతి-అర్కోణం(06728)మధ్యాహ్నం 1.30గంటలకు బయల్దేరుతుంది.
- విల్లుపురం-తిరుపతి(16854)ఉదయం 11.20గంటలకు రానుంది. తిరుపతి-విల్లుపురం(16853)మధ్యాహ్నం ఒంటిగంటకు బయల్దేరుతుంది.
- చెన్నై-తిరుపతి(06727) మధ్యాహ్నం 12.50గంటలకు రానుంది. తిరుపతి-అరక్కోణం(06754)మధ్యాహ్నం 3.45గంటలకు బయల్దేరుతుంది.
- చెన్నై-తిరుపతి(16053)సాయంత్రం 5.05గంటలకు రానుంది. తిరుపతి-చెన్నై(16058)సాయంత్రం 6 గంటలకు బయల్దేరుతుంది.

నేలబావిలో పడిపోయిన జింక

కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



జింకకు చికిత్స చేస్తున్న అటవీ, అగ్నిమాపక సిబ్బంది

కోట, ఏప్రిల్ 16: తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడు వద్ద ఉన్ననేలబావిలో ఓ జింక ప్రమాదవశాత్తు పడిపోయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా అగ్నిమాపక సిబ్బంది ఆ జింకను కాపాడి ఊపిరిపోశారు. స్థానికుల కథనం మేరకు... చిట్టేడు, కేశవరం, అటవీప్రాంతాల నుంచి ఎండ తీవ్రతను తట్టుకోలేక దాహార్తిని తీర్చుకునేందుకు ఐదేళ్ల వయస్సు కలిగిన జింక చిట్టేడులో ఉన్న ఓ నేలబావి వద్దకు వచ్చింది. గట్టుపై నుంచి నీళ్లు తాగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికులు గుర్తించి కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి బావిలో నుంచి జింకను బయటకు తీసుకువచ్చి శస్త్రచికిత్స చేయించారు. జింక తేరుకోవడంతో కేశవరం అడవుల్లో వదిలిపెట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడి మృతి

బాలాయపల్లి, ఏప్రిల్ 16: గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన బాలాయపల్లి మండలంలోని పెరిమిడి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తొట్టంబేడు మండలం చిన్న కనపర్తి గ్రామానికి చెందిన పులి మస్తాన్(38) నాయుడుపేట మండలంలోని మేనకూరులోని వెస్టేజ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పెళ్లకూరు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం సొంత పని నిమిత్తం బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి వెళుతుండగా పెరిమిడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తలపై తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహబూబ్ సుభాని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌పోస్టులో ఎస్ఈబీ తనిఖీలు

తడ, ఏప్రిల్ 16: ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ అరుణ్‌కుమార్ తడ మండలంలోని బీవీపాళెం చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తడకు వచ్చిన ఆయన చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి, వాహన తనిఖీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఈబీ ఎఈఎస్‌లు నరసింహరావు, రమేష్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో కార్మికుడి మృతి



మృతిచెందిన రాజేష్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16: అనుమానాస్పద స్థితిలో రాజేష్(30) అనే కార్మికుడు మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా నాయుడుపేట - చెన్నై రహదారి సమీపంలోని అన్నమేడు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం అరక్కోణంకు చెందిన రాజేష్ ఓజిలి మండలం పెద్దపరియ వద్ద ఉన్న ఓ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తోటి కార్మికులైన శశికుమార్, శీనుతో కలిసి అన్నమేడు క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లారు. అక్కడ ముగ్గురూ కలిసి మద్యం తాగారు. కొంత సమయం తరువాత అక్కడ నుంచి బయలుదేరారు. కొంత సేపటి తరువాత వస్తానని రాజేష్ చెప్పడంతో శశికుమార్, శీను వెళ్లిపోయారు. చీకటి పడినా రాజేష్ రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం పోలీసులు, కార్మికులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పరిశీలించగా నదిలో తేలుతున్న రాజేష్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ గోపీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని ప్రైవేట్ బస్సు డ్రైవర్ మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16: సూళ్లూరుపేటలోని ఝాన్సీనగర్‌లో కాపురం ఉంటున్న చేనిగుంట సతీష్(24) ఉరేసుకొని మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు... తమిళనాడు రెడ్‌హిల్స్‌కు చెందిన సతీష్ అదే ప్రాంతానికి చెందిన అశ్వినీని ప్రేమ వివాహం చేసుకొన్నాడు. రెండేళ్ల కిందట సూళ్లూరుపేటకు వచ్చి శ్రీసిటీలోని పరిశ్రమలకు వెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎస్ఐ రహీం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రం
సమావేశంలో సభ్యుల ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతిపురం, ఏప్రిల్ 16 : 'గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది... సమస్య పరిష్కరించాలంటే పంచాయతీ ఖాతాల్లో నిధులు కొరత ... మరి ఎలా తాగునీటి సమస్య తీర్చేది?' అధికారులే గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు విని పరిష్కరించాలని గుంజార్లపల్లె సర్పంచ్ విజయరామిరెడ్డి, సి.బండపల్లె ఎంపీటీసీ నామాలప్ప, నడింపల్లె సర్పచ్ బాలకృష్ణ మండిపడ్డారు. మంగళవారం మండల సచివాలయంలో వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. కేవలం తాగునీటి సమస్యపై మాత్రమే చర్చ జరిగింది. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ శ్రీనివాసులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మైథిలి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయరాం, కో ఆప్షన్ సభ్యుడు నిషార్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న పాల్గొన్నారు.

చిన్నారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 16 : బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి ఒంటరిగా ఏడుస్తుండిన ఏడాదిన్నర వయసుగల నందితను పోలీసు సిబ్బంది గుర్తించి సంరక్షించారు. అనంతరం ఆ చిన్నారిని ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. కాగా చిన్నారి నందిత తప్పిపోయిన సమాచారం వాట్సాప్ గ్రూపుల్లో రావడంతో గంగవరం మండలం పత్తికొండకు చెందిన ఆ చిన్నారి తల్లిదండ్రులు మంగళవారం బైరెడ్డిపల్లె పోలీసుస్టేషన్‌కు వచ్చారు. చిన్నారి తల్లిదండ్రులను ఎస్ఐ కృష్ణయ్య విచారించగా పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో తదుపరి విచారణ నిమిత్తం గంగవరం పోలీసుస్టేషన్‌కు పంపించారు. చిన్నారిని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల, సహాయకురాలు దీప, సచివాలయ మహిళాపోలీసు వనిత ప్రత్యేకశ్రద్ధ తీసుకుని తమ సంరక్షణలో వుంచుకున్నారు.

వీరేశలింగం సేవలు మరువరానివి
గంగవరం, ఏప్రిల్ 16 : కందుకూరి వీరేశలింగం సేవలు మరువరానివని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతుల జయంతిని పురస్కరించుకొని కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వీరేశలింగం పంతులు సంఘ సంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సాహితీవేత్తగా కొనియాడారు. హెచ్ఎం దామోదరం, భాస్కరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, వితంతు వివాహాలు, సతీసహగమనం లాంటి సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సోమరాజు, అనిల్‌కుమార్, ఆంజనేయరెడ్డి, రామ్‌కుమార్, ఫాహిదాబాను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి
రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, ఏప్రిల్16: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డితో సమీక్షించారు. ఈ నెల 18 నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను పోలీసులు కఠినంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల ముగిసే వరకు పోలీసులు నిఘా ఉంచి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. 18వ తేదీ నుంచి తెలుగుదేశం, వైసీపీ, భారతచైతన్య యువజన పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి అనుమతులు కోరారని వివరించారు. పుంగనూరు నియోజకవర్గంలో వివిధ అంశాలకు సంబంధించి సీ యాప్ విజిల్‌లో 65 ఫిర్యాదులు రాగా వెంటనే స్పందించి ఒకటన్నర గంటలో అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివయ్య, సీఐ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఊరంతా టీడీపీకి మద్దతు


కోడిగుండ్లపల్లెలో టీడీపీకి మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

రామకుప్పం, ఏప్రిల్ 16: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ కోడిగుండ్లపల్లెకు చెందిన గ్రామస్తులంతా టీడీపీకి మద్దతు పలికారు. మంగళవారం రాత్రి టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నేతలు ఆ గ్రామంలో శంఖరావం కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో ప్రచారానికి వచ్చిన వైసీపీ నేతలు కొందరు గ్రామస్తులకు బలవంతంగా కండువాలు కప్పారని వారు టీడీపీ నేతలకు తెలిపారు. ఎంతో నమ్మకంతో తాము వైసీపీకి ఓట్లు వేస్తే ఐదేళ్ళుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదని వైసీపీ సానుభూతి పరులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అయ్యప్పగానిపల్లె, కెంపసముద్రం గ్రామాల్లో శంఖారావం కార్యక్రమం జరిగింది. కుప్పం ప్రజలు చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ బీసీసెల్, వాణిజ్య విభాగాల కుప్పం నియోజకవర్గ ప్రధానకార్యదర్శులు వెంకటరమణ, సుబ్రీ, మాజీ ఉపసర్పంచు గంట్లరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, మండల అధ్యక్షుడు వెంకటేశ్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



కుప్పం ఏప్రిల్ 16 : అగ్ని ప్రమాదాలను ప్రజలు ఎలా ఎదుర్కోవాలో అగ్నిమాపక అధికారులు మంగళవారం కుప్పంలోని బాబు నగర్ కాలనీలో ప్రజలకు అవ గాహన కల్పించారు. వంటింట్లో సిలిండర్ నుంచి గ్యాస్ వెలిగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అనంతరం అగ్ని ప్రమాదాలపైన ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. అగ్నిమాపక అధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పించారు. గ్యాస్ మంటలు వ్యాప్తి చెందిన వెంటనే రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. చిన్న పిల్లలను వంట గదిలోకి వదలరాదని సూచించారు. అనంతరం డెమో ద్వారా అవగాహన కల్పించారు.

పోలింగ్ నిర్వహణపై అవగాహన
సదుం, ఏప్రిల్ 16: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలకు ఎన్నికల పోలింగ్ నిర్వహణపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, ఓటర్లకు అందించాల్సిన సహాయ సహకారాలు, విధి నిర్వహణలో బాధ్యతలు తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నారాయణ స్వామి, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వేశ్వరుడి ఉత్సవాలు
రామకుప్పం, ఏప్రిల్ 16: పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ సంస్థానకర్త సీతాపతి, ధర్మకర్త సజ్జల కోదండరెడ్డి తెలిపారు. 17న ఉదయం కలశస్థాపన, అంకురార్పణ, సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. 17న రాత్రి నందివాహనోత్సవం, 18న భూత, 19న సింహ, 20న నెమలి, 21న హంస వాహనసేవలు జరుగుతాయన్నారు. 22న రాత్రి గిరిజా కల్యాణం, 23న రథోత్సవం, 24న రావణవాహనసేవ, 25న వసంతోత్సవాలు, 26న ద్వాదశ హరతిసేవ, శయనోత్సవాలు జరుగుతాయన్నారు. 29న పుష్పపల్లకీ సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

9 పరీక్షా కేంద్రాల్లో స్లాస్ పరీక్షలు
పలమనేరు, ఏప్రిల్16 : పలమనేరు మండలంలో మంగళవారం 9 పరీక్షా కేంద్రాల్లో స్టేట్ లర్నింగ్ ఎచీవ్‌మెంట్(స్లాస్) పరీక్షలను నిర్వహించారు. మొత్తం 390 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 4వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.

ఓటు హక్కుపై అవగాహన
సోమల, ఏప్రిల్ 16: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఏపీఎం శివ మాట్లాడుతూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో సీసీలు గంగోజీ, నరసింహులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డెమ్మ, గౌరి, భాను, భార్గవి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడి మృతి



పుంగనూరు రూరల్, ఏప్రిల్16: చింతచెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం పుంగనూరులో చోటుచేసుకుంది. మండలంలోని మంగళంకు చెందిన రామయ్య(65) చింతకాయల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయాలు తగిలి స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు కలరు.

విద్యుత్ సిబ్బంది రైతులతో సఖ్యతగా ఉండాలి
సోమల, ఏప్రిల్ 16: సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది రైతులతో సఖ్యతగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరిగిందని, త్రీఫేస్ సరఫరాలో అంతరాయం జరిగినప్పుడు రైతుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు సక్రమంగా సమాధానం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎల్ఐ చిన్నప్పరెడ్డి, లైన్‌మెన్స్ పాల్గొన్నారు.

గౌనితిమ్మేపల్లెలో అగ్ని ప్రమాదం
బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 16 : మండలంలోని గౌనితిమ్మేపల్లెలో రైతు మంజునాథరెడ్డికి చెందిన పొలంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఒక ఎకరా పొలంలో ఏర్పాటు చేసివున్న డ్రిప్‌పైపులు, 60 కొబ్బరిచెట్లు దగ్ధమైనట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల దాదాపు రూ. 2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇంకా అగ్నిప్రమాదంవల్ల మహాగని మొక్కలు, పక్కనేవున్న దానిమ్మతోట కూడా దెబ్బతిన్నట్లు చెప్పారు.గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టివుంటారని రైతు అనుమానం వ్యక్తంచేశారు.

ఇద్దరు అధికారులపై ఎన్డీఏ నేతల ఫిర్యాదు
కుప్పం, ఏప్రిల్ 16: ఎన్నికల డీటీ రెడ్డెప్ప, కాంట్రాక్టు ఉద్యోగి నిజాంపై ఎన్నికల అధికారికి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఇద్దరు అధికారులు అధికార పార్టీకి సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే కోసం కుప్పం వచ్చిన రెడ్డెప్ప ఎన్నికల విషయాల్లో తలదూర్చి అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారిని కూటమి నేతలు కోరారు.

టీడీపీ నేతలకు నోటీసులు
కుప్పం ఏప్రిల్ 16 : కుప్పం మండలానికి చెందిన 11 మంది టీడీపీ నేతలకు కుప్పం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు మంగళవారం నోటీసులు ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురష్కరించుకుని ఆదివారం కుప్పం పట్టణంలోని నేతాజీ రోడ్డులో ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ర్యాలీ నిర్వహించడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద పరిగణించి నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వక పోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుప్పంలో పలు రైళ్ల నిలుపుదలకు అనుమతి
కుప్పం, ఏప్రిల్ 16 : కుప్పం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదలకు రైల్వే అధికారులు అంగీకరించినట్లు కుప్పం సాయిమాతా సేవాట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గత జనవరిలో బెంగళూరులోని డివిజనల్ మేనేజర్‌ను జగదీష్‌బాబు కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు వారానికి ఒకసారి తిరిగే హుబ్లీ-చెన్నై, దాదర్-పాండిచ్చేరి, వాసుకో-వేలంకని రైళ్లను , రోజూ తిరిగే బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయడానికి అంగీకరించినట్లు జగదీష్‌బాబు ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు త్వరలో పుష్పుల్ ట్రైన్‌ను కుప్పం నుంచి బెంగళూరు నడుపుటకు అనుమతించినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రామ కోటి
చౌడేపల్లె, ఏప్రిల్16: గడ్డంవారిపల్లెలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో రామకోటి నిర్వహించారు. మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

వైసీపీని సాగనంపాల్సిన బాధ్యత యువతదే
టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అమరనాథరెడ్డి, వరప్రసాద్


పార్టీలో చేరిన వారితో వరప్రసాద్, అమరనాథ రెడ్డి

గంగవరం, ఏప్రిల్ 16 : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తూ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన బాధ్యత యువకులదే అని పలమనేరు ఎమ్మెల్యే, చిత్తూరు ఎంపీ అభ్యర్థులు అమరనాథరెడ్డి, వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గంగవరం మండలం గండ్రాజుపల్లె సమీపంలో పెద్దపంజాణి మండల తెలుగు యువత సమావేశం, గంగవరం మండలంలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో పలమనేరు తెలుగుయువత ఆత్మీయ సమావేశాలకు అమరనాథరెడ్డి, వరప్రసాద్‌లు హాజరై ప్రసంగించారు. యువత భవిష్యత్తు బాగుపడాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద ట్యాక్స్‌పేయర్‌గా ఉంటూ, 30 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోన్న అమరరాజ ఫ్యాక్టరీకి పొగ పెట్టి తెలంగాణకు తరిమేసిన ఘనుడు ఈ జగన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఈ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతతోపాటు రైతులు, అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. పోలింగ్ జరిగేవరకు టీడీపీ, జనసేన, బీజేపీ యువకుల సైనికుల్లా పోరాడాలన్నారు. అనంతరం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపంజాణి, పలమనేరుకు చెందిన నాయకులు ఆనంద్, చలపతి, నాగరాజురెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, మురళి, పగడాల ప్రవీణ్, రుద్రమూర్తి, కృష్ణారెడ్డి, నగేష్, సుబ్రమణ్యం , ఆర్‌వి బాలాజి, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యం గౌడు, శ్రీధర్, ఖాజా, చాంద్‌బాష, మదన్, నాగరాజు, కృష్ణమూర్తి గౌడు, బీఆర్సీ కుమార్, జనసేన దిలీప్, హరీష్‌రాయలు, నాగరాజు శివ, బీజేపీ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను దగా చేసిన పెద్దిరెడ్డిని ఓడించండి : చల్లా



ఊటుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న చల్లా బాబు, రొంపిచెర్లలో సుప్రియారెడ్డి ప్రచారం

సదుం, ఏప్రిల్ 16: పాడి రైతులను దగా చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓడించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సదుం మండలం ఊటుపల్లె పంచాయతీలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లీటరు వాటర్ బాటిల్ రూ.20లకు అమ్ముడవుతున్న తరుణంలో లీటరు పాలకు కేవలం రూ.18 చెల్లిస్తూ పెద్దిరెడ్డి పాడి రైతుల కడుపు కొడుతున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని పాడి రైతులందరికీ లీటరు పాలకు రూ.45 గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఐదేళ్లుగా మంత్రి కనుసన్నల్లో వైసీపీ నాయకులు దౌర్జన్యాలు, భూకబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల : చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుపడుతుందని పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమల మండలం ఆవులపల్లె పంచాయతీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. ఆయన యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆవులపల్లె పంచాయతీకి చెందిన రాజన్న, బోయకొండ, రూపేశ్, మునికృష్ణ, అభిరామ్, యువరాజ్, ముని వెంకట్ తదితరులు పార్టీలో చేరారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, మాజీ సర్పంచులు హరిప్రసాద్, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కందూరులో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిలను గెలిపించాలని కరప్రతాలను అందజేశారు. అలాగే పెద్దఉప్పరపల్లెలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు యదుశేఖర్ నాయుడు, మాజీ వైస్ఎంపీపీ ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం జరిపారు.

చౌడేపల్లె: నవ్యాంధ్ర పునర్నిర్మాణం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యం అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రరెడ్డి అక్క వీణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆమె పుంగనూరు టీడీపీ నేత వెంకరమణరాజు, ఆయన కుటుంబ సభ్యులతో కలసి చౌడేపల్లె, నాయునివారిపాళ్యాం, నేతాజి కాలని, గోసలకుర్పల్లె ప్రాంతాల్లో పర్యటించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు చిన్నకిశోర్, ప్రవీణ్‌కుమార్, మనోహర్, శ్రీనివాసులు. జనసేన నాయకులు హేమంత్, శ్రీపవన్, శ్రీను, టీడీపీ నాయకులు చంద్రవదనమ్మ, ప్రదీప్‌రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రొంపిచెర్ల : మహిళల భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి కోరారు. మంగళవారం రొంపిచెర్ల పట్టణంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజాద్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, షేక్ కరీముల్లా, గౌస్‌పీర్‌ఖాన్, బాబులాల్, అబూబకర్, సైయద్‌బాషా, రామమూర్తి, రఫీ తదితరులు పాల్గొన్నారు. రొంపిచెర్లలోని చల్లాబాబు ఇంటి వద్ద పులిచెర్ల మండలం పోచంవారిపల్లె పంచాయతీ దిన్నెపాటి హరిజనవాడకు చెందిన సుధాకర్ టీడీపీలో చేరారు. రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు ముల్లంగి వెంకట్రమణ, నాయకులు మురళీనాయుడు, కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, రవికుమార్‌నాయుడు, భాస్కర, సురేంద్ర పాల్గొన్నారు.

కల్లూరు : పులిచెర్లలో తన కుమార్తె చల్లా పూజారెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ గ్రామానికి చెందిన తహీరాబికి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పుంగనూరు అభివృద్ధికి కృషి : బీసీవైపీ



రామచంద్రయాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన మైనార్టీ యువత, పొలాల్లో ప్రచారం చేస్తున్న బీసీవైపార్టీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్ 16 : పుంగనూరు నియోజకవర్గాన్ని మార్పు దిశగా అభివృద్ధి బాటలో తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు బీసీవైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. మంగళవారం పుంగనూరులోని నక్కబండకు చెందిన మైనార్టీ యువకులు ఇర్ఫాన్, నాసిర్, తాహిర్, మున్నా, మహబుబ్ బాషా, ముక్తియార్, అబ్దుల్, సుభేదార్‌వీధికి చెందిన అంజద్, అక్మల్, రాబ్బానీ, రఫీ, ఖలీల్, సుహెబ్, మౌలా, మురగేశ్, వినకిత్‌లు బీసీవైపార్టీ అధినేత రామచంద్రయాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికల్లో ఆదరిస్తే ప్రతి రైతుకు పాడిఆవు, ప్రతి మండలంలో ఒక డైయిరీ ఏర్పాటు, మామిడి, టమోటా, చింతపండు పరిశ్రమల ఏర్పాటు, గిట్టుబాటు ధర కల్పించడం, నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ, పుంగనూరులో మైనార్టీ ఉర్దూ డిగ్రీకాలేజీ, పుంగనూరులో ఐఐటీ కాలేజీ, నియోజకవర్గంలో షుగర్ ఫ్యాక్టరీ, పతంజలి పరిశ్రమ ఏర్పాటుతోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు, ప్రతి మహిళకు నెలకు రూ.15 వేలు ఆదాయం చేకూరేలా ఉపాధి, పుంగనూరులో 500 పడకల ఆసుపత్రి, పులిచెర్ల, పుంగనూరు మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు, అయ్యప్ప భక్తులకు శబరిమలకు ఉచితంగా బస్సు సౌకర్యం, హంద్రీనీవా కాల్వ పనులు పూర్తి చేయడం, మక్కా వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు అందిస్తామన్నారు.

ఆరాచక పాలనకు చరమగీతం పాడాలి

సదుం : రాష్ట్రంలో ఆరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని బీసీవైపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తిమ్మినాయనిపల్లె, గొంగివారిపల్లె, బురాగమంద, మొరవపల్లె, జోగిండ్లవారిపల్లె, చెరుకువారిపల్లె పంచాయతీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి బీసీవై మేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సొంత మండలంలో అభివృద్ధి ఆమడదూరంలో ఉన్నట్లు ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమ్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గతంలో నిర్మించిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులకు రంగులు వేసి బిల్లులు తిన్నారని మండిపడ్డారు.రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు ఆనంద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సురేంద్రయాదవ్, పాల రమేశ్‌యాదవ్, ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.


గొంగివారిపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీవై నాయకులు

టీడీపీతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, ఏప్రిల్ 16: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లెలో తెలుగు యువత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ఎన్నికలకు ముందు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి యువతను మోసం చేసారన్నారు. మరోసారి అధికారం కోసం అబద్ధాల హామీలతో యువతను మోసం చేసేందుకు వైసీపీ సిద్ధమౌతుందని, వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదన్నారు. రానున్న ఎన్నికల్లో యువత మొత్తం టీడీపీవైపే నిలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబునాయుడు, నాయకులు చంద్రశేఖర్, మునిరాజు, బేటప్పనాయుడు, హేమాంబర్ గౌడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, టీడీపీ మండలాధ్యక్షులు రామచంద్ర, తెలుగు యువత అధ్యక్షులు వెంకటేష్, ప్రకాష్, ఎల్లప్ప, సుబ్బు, భానుమూర్తి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం : తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని బీసీ సాధికారత రాష్ట్ర కన్వీనర్ అమరనాథ్‌గౌడ్ అన్నారు. మంగళవారం కుప్పం పట్టణంలో ఈడిగ కులస్తుల నేతృత్వంలో చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే ఈడిగ కులస్తులకు ఆయన ఇచ్చిన హామీలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. బీసీలందరూ ఏకతాటిపై వచ్చి చంద్రబాబుకు లక్ష మెజారిటీ సాధించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల ఈడిగ సంఘం కన్వీనర్ సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ ఇతర నేతలు వెంకటేష్, హరినాథగౌడ, శివ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎన్డీయేతోనే సంక్షేమ పథకాలు
పుంగనూరు రూరల్, ఏప్రిల్16: ఎన్డీయేతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గూడూరుపల్లె, కుమ్మరనత్తం పంచాయతీల్లో వారు పర్యటించి కరపత్రాలను అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో యువతకు ఉపాధి లేక వలసలు వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. రానున్న ఎన్నికల్లో చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శమిపతి, కృష్ణానాయక్, గంగాధర్, ప్రసాద్, రెడ్డెప్పయాదవ్, బాలరాజు, వేణు, సీకే రవి, రమణ, జనసేన నాయకులు విరూపాక్షి, బాలాజీ నాయక్, హరినాయక్, చైతన్యరాయల్, శ్రీనివాసులు, బీజేపీ నాయకులు మదన్‌మోహన్, నానబాల కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్, రహమత్‌నగర్, ఏటిగడ్డపాళ్యం, చెంగాలాపురం తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు.

నల్లబెల్లం రవాణా కేసులో ఇద్దరి అరెస్టు
రామకుప్పం, ఏప్రిల్ 16: రామకుప్పం మండలం విజలాపురం సమీపంలోని సంతమిట్ట వద్ద ఈనెల 13న సాయంత్రం ఎస్ఐ శివకుమార్ తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. నల్లబెల్లం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనం కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి 80బస్తాల నల్లబెల్లంతో బయలుదేరింది. వాహనంలోని వ్యక్తులు చూపిన బిల్లులో ఆ బెల్లం బంగారుపేట నుంచి వేలూరుకు తరలిస్తున్నట్టు ఉందని ఎస్ఐ తెలిపారు. దీనిపై తాము విచారణ జరుపుతున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అప్పుడు ఆయన తెలిపారు. ఆ బెల్లం నాటుసారా తయారీ కోసం తరలిస్తున్నట్టు తమ విచారణలో వెల్లడైనట్టు మంగళవారం ఆయన తెలిపారు. నల్లబెల్లం తరలిస్తున్న ననియాల గ్రామానికి చెందిన ఆర్ముగం, వీర్నమలకు చెందిన మనేంద్రనాయక్‌లను మంగళవారం ఉదయం అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని ఆయన తెలిపారు.

భద్రతా బలగాల కవాతు
సదుం, ఏప్రిల్ 16: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. అందులో భాగంగా సదుం నడిగడ్డ, చెరుకువారిపల్లె, అగ్రహారం గ్రామాల్లో పోలీసు, భద్రతా బలగాలతో కవాతు నిర్వహించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

హంస, సూర్యప్రభ వాహనాలపై
కోదండరాముడి చిద్విలాసం


హంస వాహనంపై కోదండరాముడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 16: నగరంలో అత్యంత ప్రాశస్త్యం పొందిన కోదండ రామాలయంలో గత మూడు రోజులుగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సంగతి తెల్సిందే. ఉత్సవాల్లో మంగళవారం ఉదయం హంస, సాయంత్రం సూర్యప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలను బాలాజి స్టోర్స్, రామ్మూర్తి పిళ్లై, రాజేంద్రన్, ప్రభాకర్ నాయుడుల ఉభయంతో ఈవో సుబ్రమణ్యం నాయుడు నిర్వహించారు. బుధవారం శ్రీరామనవమి పండుగను ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నామని, ఉదయం 5 గంటలకు గోపుర దర్శనం, గరుడ, హనుమంత వాహన సేవలు నిర్వహిస్తున్నామని ఈవో పేర్కొన్నారు.

నీళ్లు లేని బావిలో పడి ఒకరి మృతి

వెదురుకుప్పం, ఏప్రిల్ 16: నీళ్లు లేని బావిలో పడి ఒకరు మృతి చెందినట్లు రెంటాలచేను గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ రెంటాలచేను గ్రామానికి చెందిన బి.రాజేంద్రరెడ్డి(62) మంగళవారం గ్రామ సమీపంలో మేకలకు మేత తీసుకుని రావడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లు లేని లోతైన బావిలో పడ్డాడు. గట్టిగా కేకలు వేయడంతో గమనించిన గ్రామస్తులు బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడని తెలిపారు.

తోట త్రిమూర్తులకు జైలు శిక్షపై హర్షం

చిత్తూరు, ఏప్రిల్ 16: 28 సంవత్సరాల తర్వాత శిరో ముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు మంగళవారం విశాఖ కోర్టు జైలు శిక్ష విధించడంపై దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. పలువురు దళితసంఘాల నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1996లో ఐదుగురు దళితులను హింసించి, ఇద్దరికి శిరోముండనం చేసిన కేసులో దళితులు ఏమాత్రం ప్రలోభాలకు లొంగకుండా న్యాయపోరాటం చేశారన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత బాధ్యులకు కోర్టు శిక్ష విధించడం దళితుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, మునస్వామి, ధనంజయరావు, పార్థసారథి, శివరాజన్, చార్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మతాంతర వివాహం చేసుకున్నాం...
రక్షణ కల్పించండి


మాట్లాడుతున్న జాస్మిన్, తిరుమలేష్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 16: తాము మతాంతర వివాహం చేసుకున్నామని, కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట మీడియాను ఆశ్రయించింది. పెనుమూరు మండలం ఎగువ పూనేపల్లెకు చెందిన జాస్మిన్, తవణంపల్లె మండలం చారాల దళితవాడకు చెందిన తిరుమలేష్ మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గత ఐదేళ్ళుగా ప్రేమించుకుంటున్నామని, తమ మతాలు వేరు కావడంతో పెద్దలు వివాహానికి అంగీకరించలేదన్నారు. దీంతో తాము ప్రేమ వివాహం చేసుకున్నామని చెప్పారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీని కలసి రక్షణ కోరామని పేర్కొన్నారు. తమకు ప్రాణహాని వుందని పోలీసులు రక్షణ కల్పించాలని వారు కోరారు.

చిత్తూరు షుగర్స్ రిటైర్డ్ ఇంజనీర్ మృతికి సంతాపం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 16: మండలంలోని నందనూరు గ్రామానికి చెందిన చిత్తూరు చక్కెర ఫ్యాక్టరీ రిటైర్డ్ ఇంజనీర్ శ్రీరాములురెడ్డి (92) అనారోగ్యంతో రెండురోజుల క్రితం విశాఖపట్టణంలో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని సోమవారం రాత్రి స్వగ్రామమైన నందనూరు గ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పారిశ్రామికవేత్త మడవనేరి సురేష్‌రెడ్డి, వేల్కూరు బాబురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చిన్నమరెడ్డిలతో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

చిత్తూరు, ఏప్రిల్ 16: నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు.. తీసుకోవాల్సిన చర్యలపై ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడా నీటి సమస్యలు తలెత్తరాదని, మరమ్మతులు, ఇతర పనులను వేగంగా చేయాలన్నారు. వేడిగాలులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కమిషనర్ అరుణ, ఎంఈ గోమతి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కుప్పం ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాలను ప్రజలు ఎలా ఎదుర్కోవాలో అగ్నిమాపక అధికారులు మంగళవారం కుప్పంలోని బాబు నగర్ కాలనీలో ప్రజలకు అవ గాహన కల్పించారు. వంటింట్లో సిలిండర్ నుంచి గ్యాస్ వెలిగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అనంతరం అగ్ని ప్రమాదాలపైన ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు.

పుంగనూరు రూరల్: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పించారు. గ్యాస్ మంటలు వ్యాప్తి చెందిన వెంటనే రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు.

వెంకటేశ్వర స్వామిగా
దర్శనమిచ్చిన శ్రీమహావిష్ణువు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 16: గిరింపేట వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మంగళవారం శ్రీమహావిష్ణువు స్వామి వారు వెంకటేశ్వర స్వామి అలంకారంలో భక్తులను తరింపజేశారు. ఉత్సవ నిర్వాహకులు కె.యస్.కుమార్, రెడ్డిగుంట కిషోర్, అర్చకులు కిషోర్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆలయ ఉత్సవ మంటపంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

మద్యం సేవించి గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

నగరి, ఏప్రిల్ 16: నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పంలో మంగళవారం సాయంత్రం రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి శవపంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు.

పీహెచ్‌సీని సందర్శించిన
డీఎంహెచ్‌వో

వెదురుకుప్పం, ఏప్రిల్ 16: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాజు సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే బాలుపల్లెను సందర్శించి అక్కడి పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సైకిల్‌కే ఓటేస్తాం.. సమస్యలు పరిష్కరించండి

భానుప్రకాష్‌కు ఏకాంబరకుప్పం మహిళల విజ్ఞప్తి


ఏకాంబరకుప్పంలో ప్రచారం చేస్తున్న భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 16: గత ఎన్నికల్లో వైసీపీకి ఓటేసి తప్పుచేశాం.. ఈసారి సైకిల్‌కే ఓటేస్తాం.. మా సమస్యలు పరిష్కరించండని నగరి పట్టణంలోని ఏకాంబరకుప్పంలోని ప్రకాష్‌నగర్ మహిళలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను కోరారు. మంగళవారం ఏకాంబరకుప్పంలో ఆయన సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింట పంపిణీ చేస్తూ, సంక్షేమపథకాల గురించి వివరించారు. నగరి అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు తపన అని భానుప్రకాష్ పేర్కొన్నారు. చేనేత రంగం, మరమగ్గాలు, రైతులు, మహిళలు, పెన్షన్‌లు, ఇతర సంక్షేమ పథకాలను టీడీపీ పక్కాగా అమలుచేస్తుందని తెలిపారు. డ్వాక్రా గ్రూపులను ప్రవేశపెట్టిందే చంద్రబాబు అని, మహిళల సంక్షేమం తాము మరిచేదే లేదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, మాణిక్యవాసన్, కేకే శ్రీకాంత్, రజనీకాంత్, ఇలంగోవన్, తనిగవాసన్, తులసిలింగం, మురళీవరదన్, దయాలన్, గుణశేఖర్, జ్యోతి నాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌ను గెలిపించండి

నిండ్ర, ఏప్రిల్ 16: నగరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్డీయే ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని నిండ్ర మండల నాయకులు ఓటర్లను కోరారు. మంగళవారం కావనూరు పంచాయతీ, దళితవాడ, గుర్రప్పనాయుడు కండ్రిగ, ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వర, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దశరథవాసు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు వెంకటేశులు రెడ్డి, బాలరాజు, జగన్ ప్రకాష్, మహేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బాలుపల్లెలో అతిసారం?

వెదురుకుప్పం, ఏప్రిల్ 16: వెదురుకుప్పం మండలం బాలుపల్లెలో పదిమందికి వాంతులు, విరేచనాలు కావడంతో ఆ గ్రామానికి మంగళవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది వెళ్లి సహాయక చర్యలు, వైద్య సేవలు అందించారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై డీడీవో కేశవులురెడ్డి మాట్లాడుతూ ఆహారం కలుషితం కావడం వల్ల కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యాయని, వారికి వైద్య సేవలు అందించారని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని చెప్పారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ధరణి నాయుడు, కమల్‌నాథ రెడ్డి, లోకనాథ నాయుడు, రమేష్, హరి ప్రసాద్, సూరి నాయుడు, జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి

- డ్వామా పీడీ రాజశేఖర్

వెదురుకుప్పం, ఏప్రిల్ 16: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె, తిరుమలయ్యపల్లె పంచాయతీల్లో జరుగుతున్న ఫారం పండ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, సప్లై చానల్ తదితర పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలకు వేతనాలు సక్రమంగా వస్తున్నాయా? లేదా? దినసరి వేతన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరు పట్టికలను పరిశీలించారు. ఉపాధి పనులకు వచ్చే వారందరికీ వంద రోజులు పనులు పూర్తి చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ డిజేబుల్ పర్సన్ కుటుంబాలకు ఎక్కువగా పని కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులకు రాని కుటుంబీకులతో అవగాహన సమావేశాలను నిర్వహించాలన్నారు. లక్ష్యాలను పూర్తి చే యని క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీడీవో వరప్రసాద్, అదనపుకార్యక్రమ అధికారి ఇందు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



కార్వేటినగరం, ఏప్రిల్ 16: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

చంద్రబాబుతోనే యువతకు బంగారు భవిష్యత్తు

● గురజాల జగన్మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 16: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం నగరంలోని విజయదుర్గ కల్యాణ మండపంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మొదటిసారి ఓటు వేయబోతున్న యువతకు అవగాహన కల్పించేందుకు మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటు ఒక్కటే మార్గమని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన, ఇప్పుడు నడుస్తున్న వైసీపీ పాలనను యువత గమనించాలని అన్నారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నపుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రంగాలను సమాంతరంగా నడిపారన్నారు. వైసీపీ పాలనలో సీఎం జగన్ సంక్షేమం పేరుతో ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రపంచ ప్రసిద్ధి చెందిన కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానించి వారికి ప్రోత్సాహకాలిచ్చి, పరిశ్రమలు ఏర్పాటు చేయించి లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. యువత బంగారు భవిష్యత్తుకోసం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధులు హేమాద్రి, వరుణ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గోకుల్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ, నగర అధ్యక్షుడు జగన్, జనసేన నేతలు ఆరణి కవిత, యశ్వంత్ అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


క్రిష్ణజిమ్మాపురంలో వడ్లు చెరుగుతున్న గురజాల ప్రతిమ

గుడిపాలలో పాలిటెక్నిక్ ఏర్పాటు చేస్తాం

గుడిపాల, ఏప్రిల్ 16: చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపిస్తే గుడిపాల మండల కేంద్రంలో పాలిటెక్నిక్, గార్మెంట్స్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ఆయన సతీమణి ప్రతిమ, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, దీపశ్రీ, మాజీ జడ్పీటీసీ సుమతి అన్నారు. మంగళవారం వారు మండలంలోని గొల్లపల్లి, కుప్పిగానిపల్లె పంచాయతీల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉదయ, మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, అనిల్‌కుమార్, మురారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


గోవిందరెడ్డిపల్లెలో టీడీపీలో చేరిన ఎస్సీలు

ఐరాల, ఏప్రిల్ 16: ఐరాల పంచాయతీ గోవిందరెడ్డిపల్లెలో ఎస్సీ కుటుంబాలు మంగళవారం పూతలపట్టు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి రోజురోజుకు బలం చేకూరుతోందని అన్నారు. టీడీపీ గద్దెనెక్కిన వెంటనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి మురళి, టీడీపీ నాయకులు దేవాజీ, రంజిత్‌రెడ్డి, లోకనాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సాయిఈశ్వర్‌రెడ్డి, లత, శాంతమ్మ, స్వర్ణ, బీజేపీ నాయకులు సుబ్బారెడ్డి, రాజేష్‌రెడ్డి, జనసేన నాయకులు తులసిప్రసాద్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీ నాయకులకు అభివాదం చేస్తున్న షర్మిల

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16: వైసీపీ నుంచి చిత్తూరు జిల్లా బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదర్ బాషా, సిరాజ్, మహబూబ్, చిన్నా, సురేష్, కిరణ్, ఏకాంబరం, సౌందర్‌రాజ్‌లకు ఆమె పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న భార్గవ్‌రెడ్డి

ఐరాల, ఏప్రిల్ 16: మండలంలోని ఐలవారిపల్లెకు చెందిన భార్గవ్‌రెడ్డి మంగళవారం పూతలపట్టు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్‌బాబు ఆధ్వర్యంలో బంగారుపాళ్యంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెస్‌బాబు మాట్లాడుతూ మరికొంత మంది త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలియజేశారు.

కోడ్ ఉల్లంఘించొద్దు: ఆర్వో

నగరి ఏప్రిల్ 16: నామినేషన్ల సందర్భంగా కోడ్ ఉల్లంఘన చేయరాదని నగరి నియోజకవర్గ ఎన్నికల ఆర్వో వెంకటరెడ్డి అఖిలపక్షపార్టీల సమావేశంలో పేర్కొన్నారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్లు వేసే సమయాన్ని, తేదీని ముందస్తుగా తెలియజేయాలన్నారు. నామినేషన్ ర్యాలీలో టపాకాయలు కాల్చరాదన్నారు. మైక్‌కు మాత్రమే అనుమతి ఉందన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలు ఆపేస్తామని, 3 వాహనాలు మాత్రమే వెళ్లాలని, అభ్యర్థితో బాటు ఐదుగురిని మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకే నామినేషన్లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నగరి డీఎస్పీ నరసింహమూర్తి, అన్ని మండలాల తహశీల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

328వ రోజు అన్నదానం

గుడిపాల, ఏప్రిల్ 16: మండల కేంద్రమైన గుడిపాలలో మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో 328వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి కిట్టు, నాయకులు చల్లా, సుబ్రహ్మణ్యం, మనోజ్, షణ్ముగం, గోవింద గౌడ్, మహదేవన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

పూతలపట్టు, ఏప్రిల్ 16: అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని పూతలపట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చెన్నయ్య కోరారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం నాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఈనెల 19వ తేదీన టీడీపీ అభ్యర్థి మురళీమోహన్, వైసీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్‌లు నామినేషన్ వేయనున్నారు. ఈ సమావేశంలో వైసీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్, టీడీపీ మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహులు నాయుడు, నాగరాజు, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం రవాణా కేసులో
ఇద్దరి అరెస్టు

రామకుప్పం, ఏప్రిల్ 16: రామకుప్పం మండలం విజలాపురం సమీపంలోని సంతమిట్ట వద్ద ఈనెల 13న సాయంత్రం ఎస్ఐ శివకుమార్ తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. నల్లబెల్లం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనం కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి 80బస్తాల నల్లబెల్లంతో బయలుదేరింది. వాహనంలోని వ్యక్తులు చూపిన బిల్లులో ఆ బెల్లం బంగారుపేట నుంచి వేలూరుకు తరలిస్తున్నట్టు ఉందని ఎస్ఐ తెలిపారు. దీనిపై తాము విచారణ జరుపుతున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అప్పుడు ఆయన తెలిపారు. ఆ బెల్లం నాటుసారా తయారీ కోసం తరలిస్తున్నట్టు తమ విచారణలో వెల్లడైనట్టు మంగళవారం ఆయన తెలిపారు. నల్లబెల్లం తరలిస్తున్న ననియాల గ్రామానికి చెందిన ఆర్ముగం, వీర్నమలకు చెందిన మనేంద్రనాయక్ లను మంగళవారం ఉదయం అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని ఆయన తెలిపారు.

కుప్పంలో పలు రైళ్ల నిలుపుదలకు అనుమతి

కుప్పం, ఏప్రిల్ 16: కుప్పం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదలకు రైల్వే అధికారులు అంగీకరించినట్లు కుప్పం సాయిమాతా సేవాట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గత జనవరిలో బెంగళూరులోని డివిజనల్ మేనేజర్‌ను జగదీష్‌బాబు కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు వారానికి ఒకసారి తిరిగే హుబ్లీ-చెన్నై, దాదర్-పాండిచ్చేరి, వాసుకో-వేలంకని రైళ్లను, రోజూ తిరిగే బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయడానికి అంగీకరించినట్లు జగదీష్‌బాబు ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు త్వరలో పుష్పుల్ ట్రైన్‌ను కుప్పం నుంచి బెంగళూరు నడుపుటకు అనుమతించినట్లు ఆయన తెలిపారు.

పోలీసులు పటిష్ఠ భద్రత కల్పించాలి: ఆర్వో


పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటశివ

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 16: గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఈనెల 18వ తేది నుంచి 26వ తేది వరకు నామినేషన్లు దాఖలు చేయనున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ పటిష్ఠమైన భద్రత కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) సి. వెంకటశివ కోరారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో మంగళవారం డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలతో నామినేషన్ల కార్యక్రమంపై ఆర్వో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రారంభం నుంచి ముగిసేవరకు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు రావడం వల్ల తగాదాలు ఏర్పడే అవకాశం ఉన్నందున పోలీస్‌శాఖ పర్యవేక్షణ పెంపొందించాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు సైతం ఎన్నికల అధికారులకు, పోలీస్ అధికారులకు సహకారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఆర్వో రవి, డీఎస్పీ ఇలియాస్‌బాషా, ఎన్నికల డీటీ విజయక్రిష్ణ, సర్వేయర్ గణేష్, సీఐలు సత్యబాబు, లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు కుళ్ళాయప్ప, భారతి, లోకేష్, వెంకటక్రిష్ణ, ఏఎస్ఐలు ఆంజనేయులురెడ్డి, మల్లికార్జున, పలువురు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

విజయపురం, ఏప్రిల్ 16: టీడీపీ అధికారంలో వస్తేనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని మాజీ జడ్పీటీసీ వసంతా సుధాకర్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కోసలనగరం, కేశవపురం, మిట్టూరు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి, సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కోసలనగరంలో వైసీపీ నుంచి పలు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, నాయకులు కొండూరు దాము, డీఎస్‌రాజు, బాషా, చిన్నబ్బ, సోమశేఖర్, హరికృష్ణా, వెంకట్రాజు, బాలసుబ్రహ్మణ్యం రాజు, దశరథరాజు, మహేంద్ర, ప్రకాష్, గుణమ్మ పాల్గొన్నారు.

సొంత భవనం ప్రారంభమైనా...
అద్దె భవనంలోనే సచివాలయాల నిర్వహణ


నూతన సచివాలయ భవనం

కార్వేటినగరం, ఏప్రిల్ 16: జీడీ నెల్లూరు నియోజకవర్గంలో మేజర్ పంచాయతీగా ఉన్న కార్వేటినగరం పరిధిలో మొత్తం మూడు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఒకటవ సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే దానిని నిర్వహిస్తున్నారు. రెండవ, మూడవ సచివాలయాలకు కలిపి సాయిబాబా నగర్ సమీపంలో ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వీధిలో ప్రభుత్వ నిధులతో మూడంతస్థుల నూతన సచివాలయ భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని మార్చి నెలలోనే ప్రారంభించినప్పటికీ ఇంకా అద్దె భవనంలో ప్రతి నెలా అద్దె చెల్లించుకుంటూ ఎందుకు కొనసాగిస్తున్నారోనని ప్రజలు విమర్శిస్తున్నారు.

విచ్చలవిడిగా ఇటుకల తయారీ

● వాల్టా చట్టానికి తూట్లు ● పట్టించుకోని అధికారులు


దీనబంధుపురంలో ఇటుకలు తయారుచేస్తున్న కూలీలు

పాలసముద్రం, ఏప్రిల్ 16: మండలంలో ఇటుకల తయారీ, విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలు అనే చందంగా తయారైంది. తమిళనాడుకు సరిహద్దులో ఈ మండలం ఉన్నందున ఇక్కడ ఇటుకల తయారీ విచ్చలవిడిగా జరుగుతోంది. తమిళనాడు ప్రభుత్వం వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేసి, అక్కడ ఇటుకల తయారీ, అమ్మకాలకు పలు ఆంక్షలు విధించడం వల్ల ఆ రాష్ట్ర వ్యాపారులు మండలంలోని సింహరాజుపురం, సీఎం కండ్రిగ, దీనబంధుపురం, వెంగళరాజుకుప్పం, ఆముదాల, బాలక్రిష్ణాపురం, తిరుమలరాజుపురం, నరసింహాపురం ప్రాంతాల్లో ఇటుకలను ఎక్కువగా తయారుచేస్తున్నారు. తమిళనాడు వ్యాపారులు ఇక్కడ రైతులతో ఒప్పందం చేసుకుని, భూమిని లీజుకు తీసుకుని ఇటుకలు తయారీ చేసి, ఇక్కడే బట్టీలో వేసి కాల్చి ఆ రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఇక్కడ విచ్చలవిడిగా ఇటుకల తయారీ, బట్టీలను నిర్వహించడానికి వ్యాపారులు రైతులను ప్రలోభపెట్టి వృక్షసంపదను సైతం నాశనం చేస్తున్నారు. దీంతో పర్యావరణానికి కూడా ముప్పు ఏర్పడుతోంది. ఇటుకల తయారీ కోసం చెరువుల్లోని మట్టిని జేసీబీలు, హిటాచీలను ఉపయోగించి తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇక్కడి మండల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం వల్ల ఈ వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతోంది. వెయ్యి ఇటుకలు కోయడానికి కూలీలకు రూ.1200 వ్యాపారులు చెల్లిస్తున్నారు. పచ్చి ఇటుకలను బట్టీగా పేర్చి, వాటిని కాల్చిన తర్వాత వెయ్యి ఇటుకలను బట్టీల వద్దే రూ.6500 చొప్పున విక్రయిస్తున్నారు. ఇటుకల తయారీదారులు లాభాలు గడిస్తుండటంతో ఈ వ్యాపారం చేయడానికి ఎక్కువ మంది పూనుకుంటున్నారు. ఇటుకలను బట్టీల్లో కాల్చడానికి సమీపంలో వున్న అడవులను సైతం నాశనం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇటుక బట్టీలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.